ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
సోమవారం 23 సెప్టెంబరు 2024



క్షమాభిక్షతో ఊరట 6
- తిరుగుముఖం పడుతున్న గల్ఫ్ వలస కార్మికులు

బెంబేలెత్తిస్తున్న కుక్కలు 7
- గుంపులుగా వీధుల్లో సంచారం

నేటి నుంచి బొడ్డెమ్మ

- కనిపించని సందడి
- అక్టోబరు 2 నుంచి ఎంగిలి పూల బతుకమ్మ
- అక్టోబరు 11న పెద్ద బతుకమ్మ
- ఆడ పడుచులు పుట్టింటికి వచ్చే వేళ

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

బతుకమ్మ పూల పండుగ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక. తీరొక్క పూలతో తొమ్మిది రోజులపాటు ప్రకృతితో మమేకమై జరుపుకునే ఆధ్యాత్మిక వేడుక. బతుకమ్మ సంబరాల కంటే ముందు బొడ్డెమ్మ పండుగ వస్తుంది. బొడ్డెమ్మ పండుగ పిల్లలకు ప్రత్యేకం. పిల్లల ఆటాపాటలను చూసి తల్లిదండ్రులు ముచ్చటపడుతారు. పెత్రమాస నుంచి ఎంగిలి పూల బతుకమ్మ మొదలయ్యే కంటే తొమ్మిది రోజుల ముందు వరకు బొడ్డెమ్మ జరుపుకుంటారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో తొమ్మిది రోజుల ముందు, మరికొన్ని ప్రాంతాల్లో ఏడు, ఐదు రోజుల ముందు నుంచి మొదలయ్యే బొడ్డెమ్మ పండుగకు రానురాను ప్రాధాన్యం తగ్గిపోతోంది. తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ పండుగను గుర్తించినా బొడ్డెమ్మను గుర్తించకపోవడంతో చిన్నబోతోంది. ఈ నేపథ్యంలోనే బొడ్డెమ్మ సంస్కృతి తగ్గిపోయ్యే పరిస్థితి కనిపిస్తోంది. సోమవారం నుంచి బొడ్డెమ్మ పండుగ ప్రారంభం కానుంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం బొడ్డెమ్మ సంస్కృతీ పదిలంగానే ఉంది. జిల్లా కేంద్రంతోపాటు వేములవాడ, ఇతర మండలాల్లో అక్కడక్కడ బొడ్డెమ్మ ఆడుకుంటున్నారు.

- ఆడపడుచులు ఎదురుచూసే సంబరం

తెలంగాణ ఆడపడుచులు బతుకమ్మ పండుగ ఎప్పుడు వస్తుందని ఎదురు చూస్తారు. బతుకమ్మ పండుగ అంటే మహిళలే కాదు ప్రకృతి కూడా పులకరిస్తుంది. ఆడపడుచులు పుట్టింటికి వచ్చి సందడి చేసే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి అద్దంపడుతుంది.



బతుకమ్మ పండుగ రోజుల్లో పల్లెల్లో రహదారులకు ఇరువైపులా పసుపు పారబోయిసినట్లుగా తంగేడు వికసిస్తుంది. ఏ దిక్కున చూసినా కట్ల పూలు పలకరిస్తాయి. ప్రతీ ఇంటి గడప ముందు కనిపించే మందారాలు, గన్నేరు.. నేలంతా పరుచుకునే గుమ్మడి ఇలా.. తీరొక్క రంగుల పూలతో ఆడపడుచుల్లో ఆనందాన్ని నింపుతాయి. బతుకమ్మను ఆదిశక్తిగా పల్లెపల్లెలో ఏ తారతమ్యాలు లేకుండా ఆడపడుచులు జరుపుకుంటూనే ఉంటారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బతుకమ్మను మహిళలు తొమ్మిది రోజులపాటు జరుపుకుంటే.. మగవారంతా తంగేడు, గునుగు పూలను పచ్చిక బయల్లలోంచి సేకరించి తీసుకొస్తారు. ఇంటిల్లిపాది ఎంతో ఉత్సాహంగా బతుకమ్మను పేరుస్తారు. ఇలా చివరి రోజున పెద్ద బతుకమ్మ పేర్చి గౌరి దేవిని కీర్తిస్తూ ప్రధాన కూడలి వద్ద ఆడ పడుచులు బతుకమ్మ ఆడుతారు. చీకటి పడుతున్న వేళ గ్రామ శివారుల్లోని వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేస్తారు. ఆడపడుచులు వాయినాలు ఇచ్చుకుంటారు.

బొడ్డెమ్మా.. బొడ్డెమ్మా కోల్

బొడ్డెమ్మా బొడ్డెమ్మా కోల్.. బొడ్డెమ్మా బొడ్డెమ్మా బిడ్డలు ఎందరే అంటూ పిల్లలు ప్రధానంగా బొడ్డెమ్మా ఆట ఆడుకుంటారు. బొడ్డెమ్మ అనే పదాన్ని అమ్మవారి నామాలతో ఒక నామంగా గుర్తిస్తారు. చెరువుమట్టి, పుట్టమట్టి తీసుకొచ్చి ఒక పీటపైన అంతస్తులుగా బొడ్డెమ్మను తయారు చేస్తారు. వాకిలి అలికి అలంకరించి బొడ్డెమ్మను తెచ్చి బీరపువ్వు, కట్లపూలు, గన్నేరుపూలు, నందివర్ధనం వంటి పూలతో ఆటాపాటలతో పూజిస్తారు. ప్రతీ రోజు సాయంత్రం అలంకరించి బొడ్డెమ్మ చుట్టూ తిరుగుతూ కోలాటం ఆడుతారు. తొమ్మిది రోజులపాటు ఇళ్లలోనే ఉంచి చివరి రోజు చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేస్తారు. బొడ్డెమ్మ పాటల్లో చందమామను కలుపుతూ.. పాడుకోవడం ప్రధానంగా కనిపిస్తుంది. బొడ్డెమ్మ తరువాత వచ్చే అమవాస్య నుంచి మహిళలు బతుకమ్మ సంబరాలను ప్రారంభిస్తారు. బొడ్డెమ్మ సంబురాల తరువాత మరుసటి రోజు పెత్ర అమవాస్య నుంచి చిన్న బతుకమ్మ సంబరాలు మొదలై పెద్ద బతుకమ్మతో ముగుస్తాయి. ఈ సారి అక్టోబరు 2వ తేదీన అమవాస్య వస్తుండడంతో ఎంగిలిపూల బతుకమ్మ మొదలు కానుంది. పెద్ద బతుకమ్మ అక్టోబరు 11న జరుపుకోనున్నారు.

అన్నపూర్ణ రిజర్వాయర్‌కు ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 22: ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామస మీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీటి ఎత్తిపోలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.98 టీఎంసీ లకు చేరుకున్నాయి. మిడ్‌మానేరు ద్వారా వచ్చిన 3200 క్యూసెక్కుల నీటిని ఒక పంపు ద్వారా ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై



ఎస్సై రామ్మోహన్

తంగళ్లపల్లి, సెప్టెంబరు 22: తంగళ్లపల్లి ఎస్సైగా రామ్మోహన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన సుధాకర్ సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గంభీరావుపేటలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రామ్మోహన్ బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు వెలు వడ్డాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోనరావుపేట, సెప్టెంబరు 22 : కోనరావుపేట మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో తాత్కాలిక ప్రాతిపదికన ఉపాధ్యాయులుగా పని చేయడానికి దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వనపర్తి మల్లేశం ఆదివారం ప్రకటనలో తెలిపారు. పీజీటీ కెమిస్ట్రీ, తెలుగు, మ్యాథ్స్ సబ్జెక్టులను బోధించేందుకు ఎమ్మెస్సీ, ఎంఏ బీఈడీ చేసినవారు ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా రాజయ్య

ఇల్లంతకుంట, సెప్టెంబరు 22: మండల కేంద్రంలోని గౌడ సంఘం అధ్యక్షుడిగా కొయ్యడ రాజయ్య ఎన్నికయ్యారు. ఎల్లమ్మతల్లి ఆలయంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికలలో రాజయ్య విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడసంఘం అభివృద్ధికి కృషిచేస్తానని, తన ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షుడిని ఘనంగా సభ్యులు సహకరించారు.

మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌కు సన్మానం



అభినందనలు తెలుపుతున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 22: సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా నియామకమైన వెల్మల స్వరూపతిరుపతిరెడ్డిని ఆదివారం సిరిసిల్లలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. 3వ వార్డు ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వస్త్ర పరిశ్రమ, వివిధ సంఘాల నాయకులు, వ్యాపారులు, శ్రీఅభయాంజనేయ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు స్వరూపతిరుపతిరెడ్డికి అభినందనలు తెలిపారు. అనంతరం టీపీసీసీ సభ్యుడు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగుల సత్యనారాయణను వెల్మల స్వరూపతిరుపతిరెడ్డి మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం దృష్టికి వస్త్ర పరిశ్రమ విద్యుత్ సమస్య

- స్పందించిన ముఖ్యమంత్రి



ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న విద్యుత్ రాయితీ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి సీపీఎం, సీఐటీయూ నాయకులు తీసుకెళ్లారు. శనివారం రాత్రి హైదరాబాద్ లోని సచివాలయంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య, కార్యదర్శి వర్గ సభ్యుడు జూకంటి రంగారెడ్డి వినతిపత్రం అందజేశారు. సిరిసిల్ల పవర్ లూం పరిశ్రమకు అదనంగా విధించిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని కోరారు. పది హెచ్‌పీలపైన ఉన్న వాటిని నాలుగో కేటగిరీ కింద పరిశీలించి సబ్సిడీ అందించాలని, వర్కర్‌టు ఓనర్ పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని యారన్ సబ్సిడీ విడుదల చేయాలని పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు చెప్పారు. విద్యుత్ సమస్యను పరిస్తానని, పవర్‌లూం పరిశ్రమను నాలుగో కేటగిరీ కిందికి తీసుకొస్తామని హామీ ఇచ్చారని అన్నారు. స్థానికంగా పరిష్కారం ఉంటే వెంటనే వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరిష్కరించాలని, సీఎం పరిధిలో పరిష్కారం జరగాల్సి ఉంటే చేస్తానని పేర్కొన్నట్లు చెప్పారు. పరిశ్రమలోని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఉన్నారు.

మందుబాబులకు అడ్డాగా బస్టాండ్



బస్టాండ్ ఆవరణలో మద్యం గ్లాసు

చందుర్తి, సెప్టెంబరు 22 : చందుర్తి మండలం మల్యాలలో బస్టాండ్ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. అధికారులు పట్టించుకోక పోవడం వలన నిరుపయోగంగా మారింది. వేములవాడ నుంచి కోరుట్ల వైపు వెళ్లే బస్సులు బస్టాండ్ వద్ద నింపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఈ బస్టాండ్ ప్రస్తుతం దుమ్ముతో పేరుకుపోయింది. లక్షల రూపాయల ప్రజాధనం ఖర్చు పెట్టి నిర్మించిన బస్టాండ్ ప్రస్తుతం మందుబాబులకు అడ్డాగా మారింది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహించడంతో ఉదయం వేళలోనే మందుబాబులు బస్టాండ్ ఆవరణలో కూర్చొని మద్యం తాగుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, పోలీసులు స్పందించాలని, బస్టాండ్ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభంపై మంటలు



ఎగిసిపడుతున్న మంటలు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 22 : సిరిసిల్ల పట్టణం 22వ వార్డు గణేష్‌నగర్‌లో ఆదివారం విద్యుత్ స్తంభంపై షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. విద్యుత్ తీగలతోపాటు స్తంభానికి ఉన్న కేబుల్ వైర్లకు మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో స్థానిక ప్రజలు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. అటువైపు ఎవరూ వెళ్లకుండా నిలవరించి సెస్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

బురదమయంగా రహదారి



గుంతలతో బురదమయంగా మారిన పల్లిమక్త-నాగారం రహదారి

కోనరావుపేట, సెప్టెంబరు 22: కోనరావుపేట మండలంలో పల్లిమక్త-నాగారం ప్రధాన రహదారి గుంతలతో బురదమయంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వేములవాడ నంది కమాన్ నుండి పల్లిమక్త వరకు అప్పటి ప్రభుత్వం నిర్మాణానికి నిధులు మంజూరు చేసి తారు రోడ్డు నిర్మాణం చేపట్టింది. నిధులు సరిపోకపోవడంతో పల్లిమక్త నుంచి నాగారం వరకు సుమారు రెండు కిలోమీటర్లు తారు నిర్మాణం పూర్తి చేయలేకపోయింది. అది కాస్త గుంతలతో బురదమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో బురదమయంగా మారి ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవ తీసుకొని గుంతలమయంగా మారిన పల్లిమక్త-నాగారం రహదారికి నిధులు మంజూరు చేయించి తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

డంపింగ్ యార్డును తలపిస్తున్న చెరువు పరిసరాలు



చెత్త వద్ద చేరిన పందులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 22: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్దె చెరువు అలుగు ప్రాంతంలో గ్రామంలో సేకరించిన చెత్తాచెదారాన్ని పారబోస్తున్నారు. డంపింగ్ యార్డుగా మార్చారు. పందులు, కుక్కలు కోతులు చేరి ఆహార వ్యర్థాలను తినేందుకు చేరుతున్నాయి. ఆ దారి గుండా వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులపై తిరగబడుతున్నాయి. మూకుమ్మడిగా దాడికి దిగుతున్నాయి. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పొలాల వద్దకు వెళ్లాల్సిన దుస్థితి దాపురిస్తోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి చెత్తాచెదారాన్ని దారికి దూరంగా వేసి తమకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరుతున్నారు.

గ్రామ పంచాయతీల్లో మహాలక్ష్మి పథకం పత్రాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 22: ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేసిన మహాలక్ష్మి పథకం పత్రాలను పొందాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మహిళలకు రూ. 500లకే గ్యాస్ అందిస్తామని పేర్కొని నెరవేర్చిందన్నారు. అర్హులైన లబ్ధిదారుల పేరిట నేరుగా పత్రాలను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సిబ్బంది అందిస్తున్నారని లబ్ధిదారులు పొందాలని నర్సయ్య కోరారు.

బతుకమ్మ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 22: దుబాయిలో ఇండియన్ పీపుల్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆ సంఘం ప్రతినిధులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబరు 5 నుంచి సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐపీఎఫ్ ప్రతినిధులు సత్యం, మహేందర్‌రెడ్డి, కృష్ణ, గంగారం, ఆంజనేయులు, శ్యాంరెడ్డి, యోగేశ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సత్యం



రాజన్న దర్శనం కోసం బారులుదీరిన భక్తులు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

రాజన్నకు భక్తుల మొక్కులు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 22 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించిన భక్తులు క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకొని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం రాజన్నకు అత్యంత ప్రీతి పాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో వినోద్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జీవో 25ను రద్దు చేయాలి

జమ్మికుంట రూరల్ సెప్టెంబరు 22: రాష్ట్ర ప్రభుత్వం జీవో 25ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను రక్షించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి డిమాండ్ చేశారు. జమ్మికుంట పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీవో 25ను తీసుకువచ్చి పాఠశాల ఉపాధ్యాయులను సర్దుబాలు ప్రక్రియ మొదలు పెట్టిందన్నారు. జీవో ప్రకారం 1నుంచి10 మంది పిల్లలు ఉంటే ఒక ఉపాధ్యాయుడు 11-60కి ఇద్దరు, 61-90కి ముగ్గురు, 91-120 నలుగురు, 121-150 ఐదుగురు ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉంటుందన్నారు. 60మంది పిల్లలు ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులు పని చేయాలంటే ఎలా సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏబూషి శ్రీనివాస్, సదానందం, సంపత్, ఉమ, ఎం శ్రీనివాస్, బలరాం, కనకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజికి మృతదేహం అప్పగింత

వీణవంక, సెప్టెంబర్ 22: మండలంలోని కొండపాక గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ అవాల మణెమ్మ (80) అనారోగ్యంతో మృతి చెందింది. 2014లో కొండపాక ఎంపీటీసీగా పని చేసింది.క 'ుటుంబ సభ్యులు మణెమ్మ కోరిక మేరకు అర్‌వీఎం మెడికల్ కళాశాలకు అప్పగించారు. మణెమ్మ కుటుంబసభ్యులను ఎంపీ ఈటల రాజేందర్ ఫోన్‌లో పరామర్శించారు. పలువురు నాయకులు మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

పిడుగుపాటుకు గేదె మృతి



మృతి చెందిన గేదె వద్ద రైతు

తిమ్మాపూర్, సెప్టెంబరు 22: మండలంలోని రామకృష్ణ కాలనీ గ్రామంలో ఆదివారం పిడుగుపడి అలువాల గంగయ్య అనే రైతుకు చెందిన గేదె మృతి చెందింది. మృతి చెందిన గేదె సుమారు 70వేల రూపాయల విలువ ఉంటుందని ప్రభుత్వం తనను అదుకోవాలని రైతు గంగయ్య విజ్ఞప్తి చేస్తున్నాడు.

క్షమాభిక్షతో అక్రమ వలసదారులకు ఊరట

- జరిమానా రద్దుచేసిన యూఏఈ - 22రోజుల్లో అవుట్ పాస్‌పోర్ట్‌కోసం వేలాది దరఖాస్తులు
- భారత రాయబార కార్యాలయాల వద్ద పెరిగిన రద్దీ



సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 22: యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో ఇటీవల ప్రకటించిన క్షమాభిక్షతో అక్రమ వలసదారులకు ఊరట లభించింది. ఈ సందర్భంగా యూఏఈని అక్రమవలసదారులకు విధించే జరిమానాను రద్దు చేసింది. ఈనెల 1నుంచి అమ్నెస్టీ ప్రకటించిన 22రోజుల్లో దాదాపు 20 వేలకు పైగా అక్రమవలసదారులు అవుట్‌పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేశారని జనరల్ డైరెక్టరేట్ ఆఫ్ రెసిడెన్సీ అండ్ ఫారిన్ ఎఫైర్స్(జీడీఎఫ్ఆర్ఏ) వెల్లడించింది. దీంతో దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయాల వద్ద రద్దీ పెరిగింది. ఇప్పటికే అనేకమంది అవుట్‌పాస్ పోర్ట్ తీసుకొని ప్రవాస తెలంగాణ కార్మికులు దుబాయ్‌నుంచి తిరుగుముఖం పడుతున్నారు.

● 20వేల మంది..

దుబాయ్‌లో తెలంగాణకు చెందిన దాదాపు 20 వేలమంది అక్రమ వలసదారులు ఉండవచ్చని భారత రాయబార కార్యాలయం అంచనా వేసింది. ఇందులో సిరిసిల్ల, వేములవాడ, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, నిజామాబాద్, ఆర్మూర్, నిర్మల్, కామారెడ్డి, అదిలాబాద్, మెదక్ తదితర ప్రాంతాలకు చెందిన కార్మికులు ఎక్కువగా ఉంటారు. కేవలం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన దాదాపు అయిదువేల మంది కార్మికులు వీసా లేకుండా చాటుమాటుగా పనులు చూసుకుంటూ కాలం గడుపుతున్నారు. క్షమాభిక్ష కారణంగా అక్రమ వలసదారులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. అయిదేళ్ల తర్వాత యూఏఈ ప్రభుత్వం మళ్లీ అవకాశం కల్పించింది. ఈసారి గడువు రెండు నెలలు ఇవ్వడంతో అనేకమంది తిరిగి వచ్చే అవకాశం ఉంది.

● టికెట్ కోసం కార్మికుల ఆశలు...

దుబాయ్‌లో అక్రమంగా ఉంటున్న వలస కార్మికులకు టికెట్‌కు డబ్బులు లేక తిరిగి వచ్చేందుకు ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. అక్రమంగా ఉంటున్న ప్రవాస కార్మికులందరికీ టికెట్లు స్పాన్సర్ చేయాలని దుబాయ్‌లోని గల్ఫ్ కార్మికులు కోరుతున్నారు. అక్రమవలసదారులు ఎమర్జెన్సీ సర్టిఫికెట్ కోసం 60 దిర్హామ్‌లు, సర్వీస్ ఫీజు 9 దిర్హామ్‌లు చెల్లించనవసరం లేదని ఇండియన్ కౌన్సులేట్ జనరల్ ఇప్పటికే ప్రకటించింది. దీంతో అక్రమ వలసదారులకు కొంత భారం తగ్గినట్లయింది. ఇదేవిధంగా తిరిగి రావడానికి అయ్యే విమాన ఖర్చులను చెల్లించాలని దుబాయ్‌లోని పలు యూనియన్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఇప్పటివరకు అనేకమంది అక్రమ వలసదారులు వారి కుటుంబసభ్యుల ద్వారా దుబాయ్‌లో ఉండే స్నేహితులకు డబ్బులు పంపించి టికెట్ తీసుకుంటున్నారు. టికెట్‌కు డబ్బులు పంపించలేని కార్మికులకు టికెట్ ఇప్పిస్తారని ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ ఎంపికలు

హుజూరాబాద్, సెప్టెంబరు 22: ఈ నెల 23, 24న జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ సెలక్షన్స్ హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సొల్లు సారయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న అండర్-17 బాలబాలికలు, 24న అండర్-14 బాలబాలికలకు కబడ్డీ సెలక్షన్స్ జరుగుతాయని పేర్కొన్నారు. పాల్గొనే క్రీడాకారులు మండల కబడ్డీ జట్లు ప్రారంభ కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని తెలిపారు. ప్రతి టీమ్ కూడా వారి మండల ప్లాగ్, అర్హత ఫామ్, ఆధార్‌కార్డు జిరాక్స్ జతచేసి ఉదయం 9గంటలకు హుజూరాబాద్ హైస్కూల్ గ్రౌండ్‌లో హాజరు కావాలని కోరారు.

ఊర చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లెల జగన్మోహన్

గన్నేరువరం, సెప్టెంబరు 22: మండల కేంద్రంలోని ఊర చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లెల జగన్మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామస్థులతో కలిసి చెరువు వద్ద మీడియాతో మాట్లాడారు. గన్నేరువరం చెరువు ఏళ్ల తరబడి ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. చెరువు పక్కనే మానేరు డ్యాం, గుట్టలు, ప్రకృతివనం ఆహ్లాదకరంగా ఉన్నప్పటికీ చెరువు కట్ట అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. కట్టపై పిచ్చి మొక్కలతో నిండి వాహనాల ప్రయాణానికి సైతం ఇరుకుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరవచూపి చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కాంతాల అంజిరెడ్డి, పుల్లెల రాము, కొట్టె భూమయ్య, ఐలయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌పై విరిగిపడ్డ హైమాస్ట్ లైట్ల స్తంభం

● నిలిచిపోయిన విద్యుత్

శంకరపట్నం, సెప్టెంబరు 22: శంకరపట్నం మండలం ముత్తారం గ్రామంలో విద్యుత్ ఎల్టీ లైన్‌పై హైమాస్ట్ లైట్ల స్తంభం విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ముత్తారం రామాలయం వెనుక హైమాస్ట్ లైట్ల కోసం ఏర్పాటు చేసిన స్తంభం ఆదివారం రాత్రి వీచిన గాలికి ఆకస్మాత్తుగా విరిగి విద్యుత్ లైన్‌పై పడిపోయింది. దీంతో కన్నాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సుమారు గంటన్నర పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది విరిగిపడ్డ స్తంభాన్ని తొలగించి విద్యుత్ లైన్ పునరుద్ధరించి తిరిగి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

మున్సిపల్ అధికారుల దాడులు

- ప్లాస్టిక్ కవర్ల స్వాధీనం.. జరిమానాల విధింపు



పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

కోరుట్ల, సెప్టెంబరు 22: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న చికెన్, మటన్ దుకాణాల్లో మున్సిపల్ అధికారులు ఆదివారం సోదాలను నిర్వహించారు. దుకాణాల్లో ఉన్న ప్లాస్టిక్ నిల్వను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. ప్లాస్టిక్ కవర్లు వాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని ప్రతీ దుకాణదారులకు రూ. 2500 జరిమాన విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తిరుపతి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని యజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. కొనుగోలుకు వచ్చే వినియోగదారులు బట్ట సంచులతో రావాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలే అశోక్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇప్పపల్లి-పోతారం అడవుల్లో సరిహద్దు వివాదం

- ఎటూ తేల్చని అటవీ, రెవెన్యూ శాఖలు
- ఏడాది కాలంగా గొడవలు
- నిత్యం యంత్రాలతో యథేచ్ఛగా అడవి ధ్వంసం



ధ్వంసమైన అడవిలో చదును చేసిన స్థలం

కథలాపూర్, సెప్టెంబరు 22: మండలంలోని ఇప్పపల్లి - పోతారం అటవీ, రెవెన్యూ సరిహద్దు వివాదం రోజురోజుకూ రాజుకుంటోంది. ఈ క్రమంలో అడవి నిత్యం విచ్చలవిడిగా నరికివేతకు గురవుతున్నా రెండు శాఖలు నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ భూమి తమకే చెందుతుందని శివారు మాదేనని ఇరు గ్రామాల ప్రజలు అడవి తల్లిపై గొడ్డలి వేటు వేస్తున్న నేపథ్యంలో వందలాది ఎకరాలు ధ్వంసానికి గురవుతున్నాయి.

- రాత్రి, పగలు తేడా లేకుండా..

రాత్రి, పగలు యథేచ్ఛగా యంత్రాలతో భూమిని చదును చేస్తుండగా అటవీ శాఖ కళ్లుండీ చూడలేక పోతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోటా పోటీగా రెండు గ్రామాలకు చెందిన వ్యక్తులు పోడుకు ప్రయత్నిస్తూ ఒకరిపైనొకరు అటవీ శాఖ కు పిర్యాదులు చేసుకోవడం సర్వసాధారణంగా మారిపోయింది. ఇప్పటికే ఏడాది కాలంగా అడవుల ధ్వంసంపై గొడవలు జరుగుతుండగా పోలీసు యంత్రాంగం పలుమార్లు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని ఇరువర్గాలకు సముదాయించిన ఘటనలు కూడా ఉన్నాయి. పోతారానికి చెందిన ఓ సామాజిక వర్గం తమకు శ్మశాన వాటికకు స్థలం కావాలంటూ చెట్లను ఇబ్బడిముబ్బడిగా నరికివేస్తుండగా ఇప్పపల్లి వాసులు అడ్డుకుంటున్నారు. ఈ శివారు తమకే వర్తిస్తుందని అడవిని కాపాడుకుంటామని అటవీశాఖకు చెందిన అధికారులతో ఇటీవల వాదించారు. గడిచిన ఏడాది కిందట ఇప్పపల్లి వాసులు అడవిని యం త్రాలతో ధ్వంసం చేశారని పేర్కొంటూ అటవీ శాఖ అధికారులు రు 2 లక్షల జరిమానా విధించారు. వారం రోజుల కిందట అటవీశాఖ ఉన్నతాధికారులు ఇప్పపల్లిలో సమా వేశం ఏర్పాటు చేయగా అటవీ, రెవెన్యూ సరిహ ద్దులు తేల్చాలని డిమాండ్ చేశారు. అయితే రెవెన్యూ, అటవీ శాఖల సమస్వయం లేకపోవడం వల్ల సరిహద్దు వివాదం చిలికి చిలికి గాలివానలా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ కారణంగానే భారీ విస్తీర్ణంలో అడ వి ధ్వంసం కాబడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



నరికి వేసిన చెట్లు

బీసీ కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

- బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్



మాట్లాడుతున్న ఎన్నం ప్రకాష్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 22: బీసీ కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని పద్మావతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 25న హైదరాబాద్‌లో సుందరయ్య పార్క్ నుంచి ఇందిరాపార్క్ వరకు తలపెట్టిన కులగణన మార్చ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హైకోర్టు తీర్పుతో నైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కుల గణనను ప్రారంభించడానికి రోడ్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వెంటనే కుల గణనను చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు సంపత్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గీకురు రవీందర్, రాష్ట్ర కార్యదర్శి కోడూరి పరుశురామ్ గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి జి ఎస్ ఆనంద్, బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజురాకేశ్‌చారి, కనకయ్య గౌడ్, రాచమల్ల రాజు,దొగ్గలి శ్రీధర్, పెంట శ్రీనివాస్, ఎడ్ల సురేందర్, వంగల రవి గోపాల్, మాచర్ల అంజయ్య గౌడ్, మాదాసు సంజీవ్, కాయితోజు బ్రహ్మచారి, సుధాగోణి గణేశ్‌గౌడ్, బియ్యాని తిరుపతి, తాళ్లపల్లి మహేష్, తదితరులు పాల్గొన్నారు.



ఓసీపీ-5 పీఎల్‌ఆర్ కంపెనీ నుంచి తరలివెళుతున్న స్థానికేతరులు

రామగుండంలో 'స్థానిక' వివాదం

- ● ఓపెన్‌కాస్టు నుంచి తరలివెళ్లిన స్థానికేతరులు
- ● రెండు ఓబీ కంపెనీల్లో వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు

గోదావరిఖని, సెప్టెంబరు 22: రామగుండంలో స్థానిక నినాదం భగ్గుమన్నది. ఆర్‌జీ-1 పరిధిలోని రామగుండం నియోజకవర్గ పరిధిలోని ఓసీపీ-5, ఓసీపీ-3 రెండు ఓపెన్‌కాస్టుల్లో ఓబీ కాంట్రాక్టర్ల వద్ద 1200మంది కార్మికులు పనిచేస్తారు. ఇందులో 80శాతం స్థానికేతరులే ఉంటారు. వీరంతా ఒరిస్సా, బీహార్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి ఈ కాంట్రాక్టు కంపెనీల్లో పనిచేస్తుంటారు. ఓబీ పనుల్లో వోల్వో డ్రైవర్లుగా, టెక్నీషియన్లుగా ఇతర రాష్ట్రాల నుంచి ఉద్యోగులను తీసుకువచ్చి ఓపెన్‌కాస్టులపైనే ఓబీ కంపెనీలు గుడారాలు వేసి పని చేయిస్తుంటారు. పని స్థలాల్లో వీరు ఉండడం వల్ల పూర్తి పని సమయాల్లో కాంట్రాక్టర్లు వాడుకుంటారు. జీతాల చెల్లింపుల్లో కూడా ఓబీ కాంట్రాక్టర్లకు ప్రయోజనం ఉంటుంది. ఇది ఎన్నో ఏళ్లగా జరుగుతున్న ప్రక్రియ, మార్పు అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తాను గెలిస్తే ఇక్కడ పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి పెంచుతామని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ చెప్పిన విధంగానే ఇప్పుడు ఆచరణ మొదలైంది. నెల రోజుల క్రితం ఓసీపీ-3 ప్రాజెక్టులో ఆర్‌వీఆర్ కంపెనీ ఓబీ కాంట్రాక్టర్ దగ్గర 600మంది పని చేస్తుంటారు. ఇందులో 500మంది స్థానికేతరులే. స్థానికులనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలని, లేకుంటే పని బంద్ చేయాలని ఎమ్మెల్యే ఆదేశాలతో 25రోజులు గత నెలలో ఆర్‌వీఆర్ ఓసీపీలో పనులు బంద్ అయ్యాయి. చివరికి 80మంది స్థానికులనే ఉద్యోగాల్లో తీసుకుంటామని, కార్మిక చట్టాల జీవో అమలుచేస్తామని హామీ ఇవ్వడంతో తిరిగి ఆర్‌వీఆర్ పనులు కొనసాగుతున్నాయి. ఈ స్ఫూర్తితో వారంరోజుల క్రితం స్థానిక కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సూచన మేరకు ఓసీపీ-5లోని పీసీ పటేల్ ఓబీ కాంట్రాక్టు పనులను కూడా బంద్ చేయించారు. ఈ అంశం డైరెక్టర్లు, సీఎండీ వరకు వెళ్లింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఓసీపీ-5లో కూడా 80శాతం మంది స్థానికులనే ఉద్యోగులుగా తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పీసీ పటేల్ కంపెనీలో పని చేసే సుమారు 600మంది స్థానికేతర కార్మికులు ఆదివారం తమ తమ ఊళ్లకు వెళ్లిపోయారు. దీంతో ఓసీపీ-5 పీసీ పటేల్ కంపెనీలో, ఓసీపీ-3 ఆర్‌వీఆర్ ఓబీ కంపెనీలో సుమారు 1000మంది స్థానికులకు ఉద్యోగాలు లభించే అవకాశం ఏర్పడింది. ఈ పరిణామం పట్ల స్థానిక నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బెంబేలెత్తిస్తున్న కుక్కలు

- గుంపులుగా వీధుల్లో సంచారం
- ప్రజలు, మూగజీవాలపై దాడులు
- అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 22: వీధికుక్కల దాడుల వరుస సంఘటనలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కొన్ని రోజులుగా ప్రతిరోజూ ఏదో ఒక చోట వీధి కుక్కలు పిల్లలు, పెద్దలు, మహిళలపై దాడుల చేసి తీవ్రంగా గాయపరుచడంతో ప్రజలు తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట, పెద్దూర్, సర్దాపూర్, రగుడు, చిన్నబోనాల, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, పెద్దబోనాల, దూప్యానాయక్ తండా, తుర్కాకాశీపల్లె, జగ్గారావుపల్లె, మాలపల్లె, బాబాజీ కాలనీ, ఇప్పలపల్లెలో కుక్కలు చెలరేగిపోతున్నాయి. దీంతో ఇళ్లలో నుంచి బయటకు రావడానికి మహిళలు, చిన్న పిల్లలు భయపడుతున్నారు. మూగజీవాలకు కూడా రక్షణ లేకుండా పోయింది. వీధుల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. ఇటీవల పెద్దూర్‌లోని పలువురు చిన్న పిల్లలపై దాడి చేసి గాయపర్చాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సిరిసిల్ల జిల్లా పెద్దూర్‌లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు



కుక్కలతో అవస్థలు..

పెద్దూర్‌లో కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో అవస్థలు పడుతున్నాం. ప్రజలపై దాడులు చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. జనం వీధుల్లో తిరగలేని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- ఉలిసె తిరుపతి, పెద్దూర్



జనం భయపడుతున్నారు..

రోడ్లపై కుక్కల గుంపులతో గ్రామాల్లో జనం భయపడుతున్నారు. కుక్కల దాడితో చాలా మంది గాయపడుతున్నారు. బయటకు రావాడానికి జనం వణికిపోతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలి.

- జీలకిషన్‌యాదవ్, సింగిల్ విండో చైర్మన్

నామాపూర్‌లో గంజాయి పట్టివేత

- ముగ్గురి అరెస్టు

పెగడపల్లి, సెప్టెంబరు 22: మండలంలోని నామాపూర్ గ్రామ శివారులో ఆదివారం గంజాయి సేవిస్తున్న ముగ్గురిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పెగడపల్లి ఎస్‌ఐ రవికిరణ్ తెలిపారు. నామాపూర్ గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రదేశంలో గంజాయి సేవిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది తిరుపతి, రాజేష్, సంపత్, ఎల్లయ్యలు ఒక బృందంగా ఏర్పడి గంజాయి సేవిస్తున్న తోడేటి వెంకటేష్ ధర్మపురి మండలం తిమ్మాపూర్, బుగ్గారం మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన లింగాల వంశీ, చొప్పదండి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన గుండేటి ప్రవీణ్‌లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 500 గ్రాములు గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్‌లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్‌ఐ రవికిరణ్ తెలిపారు. గంజాయి విక్రయించినా, సేవించినా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నాటుబాంబుల తయారీ ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

కోనరావుపేట, సెప్టెంబరు 22: నాటుబాంబుల తయారీ ముఠాను పోలీసులు అరెస్టు చేసినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఆదివారం వివరాలను వెల్లడించారు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన ముడికె మల్లయ్యకు చెందిన గేదె మేత మేస్తూ గడ్డిలో ఉన్న నాటుబాంబును కొరకడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధిత రైతు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ధర్మారం గ్రామానికి చెందిన పిట్టల రాజలింగం, బోనాలకు చెందిన తుమ్మల కనకరాజు, పడగల లక్ష్మీరాజం నాటు బాంబులను తయారు చేస్తూ అడవి జంతువులను వేటాడుతున్నట్లు తేలింది. వారి వద్ద 27 నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పిట్టల రాజలింగంను గతంలో రిమాండ్ పంపినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో కోనరావుపేట ఎస్సై రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

దాడి చేయడంతో మనస్తాపం ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

చందుర్తి సెప్టెంబరు 22: చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన సూత్రం ఆంజనేయులు (22) అనే యువకుడు ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నర్సింగాపూర్‌కు చెందిన ఆంజనేయులు తమ కుటుంబ అంతర్గత విషయాల్లో జోక్య చేసుకోవద్దని అదే గ్రామానికి చెందిన ఆరుగురు దాడి చేశారు. దీంతో మనస్తాపం చెంది ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో రేకుల పెడ్డుకు ఉరేసుకున్నాడు. ఆంజనేయుల తల్లి రాజవ్వ ఫిర్యాదుతో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బాబు తెలిపారు.

కుక్కలు అడ్డురావడంతో అదుపుతప్పిన బైక్ ఇద్దరికి గాయాలు

రుద్రంగి, సెప్టెంబరు 22: మండల కేంద్రంలో ఆదివారం బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. కథలాపూర్ మండలం కలికోటకు చెందిన దేవరాజం ద్విచక్ర వాహనంపై చందుర్తి మండలం మల్యాల నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. రుద్రంగిలోని ఇందిరాచౌక్ వద్ద కుక్కల గుంపు బైక్ వైపు రావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. దేవరాజం కాలు విరిగింది. బైక్ వెనకాల కూర్చున్న మహిళకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వేములవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దేవుడి సొమ్ము విక్రయించే యత్నం

- స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగింత

కోల్‌సిటీ, సెప్టెంబరు 22: రామగుండం విద్యుత్‌నగర్‌లో హనుమాన్ టెంపుల్‌లో కిలోకుపైగా వెండి ఆభరణాలు చోరీ చేసి ఆ సొత్తును గోదావరిఖని స్వర్ణకారులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా ఆదివారం స్వర్ణకారులు ఇచ్చిన సమాచారంతో రామగుండం వాసులు పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. రామగుండం విద్యుత్‌నగర్‌లోని హనుమాన్‌దేవాలయంలో రెండు రోజుల క్రితం చోరీ జరిగింది. దేవునికి అలంకరించిన కిలో వెండివస్తువులు, కొంత బంగారాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆదివారం గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని ఒక స్వర్ణకారుడిని సంప్రదించిన దొంగలు తాము వెండి వస్తువులు తీసుకువస్తామని చెప్పారు. చోరీ జరిగిన సమాచారం ఉన్న సదరు స్వర్ణకారుడు రామగుండంలోని అతని సోదరునికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆలయ పూజారితో పాటు కాలనీవాసులు ఆదివారం లక్ష్మీనగర్‌లో కాపుకాశారు. సదరు దొంగ ఆభరణాలతో రాగానే పట్టుకున్నారు. అతడిని గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

కొడుకుకు గడ్డిమందు తాగిచ్చి హత్యాయత్నం

- వివాహేతర సంబంధం బయటపడుతుందని ప్రియుడితో కలిసి ఘాతుకం

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 22: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి రూరల్ మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో ఓ తల్లి తన వివాహేతర సంబంధం బయటపడుతుందని ప్రియుడితో కలిసి కన్న కొడుకుకు గడ్డి మందు ఇచ్చి చంపాలని చూసింది. ఈ ఘటన 20 రోజుల క్రితం జరగగా దుబాయిలో ఉన్న తండ్రికి విషయం తెలియడంతో స్వగ్రామానికి చేరుకుని మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. జగ్గసాగర్ గ్రామంలో ఉంటున్న ఓ వ్యక్తి జీవనోపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం గల్ఫ్ వెళ్లాడు. అతని భార్య, కుమారుడు గ్రామంలో ఉంటున్నారు. గ్రామంలోని మరో వ్యక్తితో సదరు మహిళ కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ప్రియుడితో మహిళ కలిసి ఉండటాన్ని కుమారుడు ఒకరోజు చూసాడు. దీంతో తన బండారం బయటపడుతుందని కొడుకును అడ్డు తొలగించుకోవాలని ఆమె నిర్ణయించుకుంది. వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తితో కలిసి మహిళ తన కొడుకుకు ఈనెల 2వ తేదీన బలవంతంగా గడ్డి మందు తాగించింది. అనుమానం రాకుండా ఉండేందుకు ఆరోగ్యం బాగా లేదని గ్రామంలోని ఆర్ ఎంపీతో మూడు రోజులు చికిత్స చేయించింది. పరిస్థితి విషమించడంతో మెట్‌పల్లిలోని ఆసుపత్రికి తరలించింది. వైద్యులు పరీక్షలు చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించాలని సూచించారు. ప్రస్తుతం నిజాబామాద్‌లో ప్రాణాపాయ స్థితిలో యువకుడు చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న యువకుడి తండ్రి గల్ఫ్ నుంచి ఇటీవల వచ్చి అసలు విషయం ఏంటని ఆరా తీశాడు. భార్య విషయం బయటపడడంతో ఆదివారం మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దరాప్తు చేస్తున్నారు.

గోదావరిలో మృతదేహం లభ్యం

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 22: గోదావరినదిలో ఆదివారం సాయంత్రం ఓ వ్యక్తి మృతదేహం లభించినట్టు గోదావరిఖని టుటౌన్ పోలీసులు తెలిపారు. మృతుడు మంచిర్యాల జిల్లాకు చెందిన సాటం వెంకటేష్(32)గా గుర్తించినట్టు పేర్కొన్నారు. మృతుడు మంచిర్యాలటౌన్‌లో ఇంటర్‌నెట్ షాపు నడుపుకుంటూ జీవిస్తుంటాడని, ఓ హత్య కేసులో జైలుకు వెళ్లి వారం రోజుల క్రితం కండీషన్ బెయిల్‌పై వచ్చిన అతడు నదిలో మృతదేహంగా మారినట్టు తెలిపారు. వెంకటేష్ ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎవరైనా హత్య చేసి ఉంటారా అనేది తేలాల్సి ఉందని, ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. మృతుడి బంధువుల్లో ఒకరు మృతదేహాన్ని చూసి వెంకటేష్‌గా గుర్తించారన్నారు.

ఇళ్ల చుట్టూ ఎస్సారెస్పీ కెనాల్ నీళ్లు



ఇంటి చుట్టూ చేరిన కెనాల్ నీళ్లు

మంథనిరూరల్, సెప్టెంబరు 22: మండలంలోని కన్నాల గ్రామంలో ఎస్సారెస్పీ కెనాల్ నీళ్ల ఇళ్ల చుట్టూ వచ్చి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలో పూడిక పూడిక పెరుకుపోవడంతో నీళ్ల ఇళ్ల మధ్యకు వస్తున్నాయి. జంగిలి బుజ్జమ్మ, జంగిలి రాధమ్మతో పాటు పలువురి ఇళ్లల్లోకి నీరు రావడంతో ఇబ్బందులు పడుతున్నారు.

డ్రైవర్ విధులకు ఆటంకం కలిగించిన ఆర్‌ఎంపీపై కేసు నమోదు

- ఆర్టీసీ బస్సు ఇంటి వద్ద ఆపలేదని వివాదం



పోలీస్‌స్టేషన్ ఎదుట నిలిపిన ఆర్టీసీ బస్సు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 22: ఆర్టీసీ బస్సు డ్రైవర్ విధులకు ఆటంకం కలిగించిన మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ తాడూరి రాజేశంపై కేసునమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం కరీంనగర్ నుండి ఇల్లంతకుంట మీదుగా జేబీఎస్‌కు ఆదివారం బయలుదేరింది. ఇల్లంతకుంటలోని బస్టాండులో రాజేశం బస్సు ఎక్కి మార్గమద్యలోని తన ఇంటివద్ద ఆపాలని కోరాడు. డ్రైవర్ ఇంటివద్ద కొంత సమయం బస్సును ఆపినా ఇంట్లోని వారు రాకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారని డ్రైవర్ తెలిపాడు. దీనితో ఆవేశానికి లోనైన రాజేశం డ్రైవర్‌ను దుర్భాషలాడుతూ దాడి చేసేందుకు వెళ్లాడు. డ్రైవర్ ఆర్టీసీ బస్సును తీసుకొని నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. డ్రైవర్ శెట్టి తిరుమలరాజు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 22: కరీంనగర్‌లోని రాజీవ్ చౌక్ వద్ద న్యూ పీకాక్ రెస్టారెంట్‌లో ఆదివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. రెస్టారెంట్‌లోని కిచెన్‌లో చిమ్ని వద్ద పెద్దఎత్తున పొగలు రావడంతో సిబ్బంది వెంటనే కరీంనగర్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో ఫైర్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సంఘటనలో 2 లక్షల రూపాయలకు పైగా నష్టం వాటిల్లినట్టు కరీంనగర్ డివిజన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అగ్నిప్రమాద ఘటనపై విచారణ జరుపుతున్నామని ఆయన తెలిపారు.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

బస్సులో రూ. 2 లక్షలు మర్చిపోయిన ప్రయాణికుడు

- అందజేసిన మంథని డీఎం శ్రావణ్‌కుమార్



రమేశ్‌కు డబ్బులు అందజేస్తున్న డీఎం శ్రావణ్‌కుమార్

మంథని, సెప్టెంబరు 22: ఆర్టీసి బస్సులో ప్రయాణికుడు మర్చిపోయిన రూ. 2 లక్షలను మంథని డీఎం శ్రావణ్‌కుమార్ ఆదివారం అప్పగించారు. మంథని డిపోకు చెందిన బస్సు గోదావరిఖని నుంచి భూపాలపల్లికి వెళ్తుండగా మార్గమధ్యలో కాటారంలో జే రమేశ్ అనే ప్రయాణికుడు ఎక్కాడు. ఈక్రమంలో తన వెంట ఉన్న కవర్‌లో రూ. 2 లక్షలను సీటులోనే ఉంచి మర్చిపోయి భూపాలపల్లిలో దిగిపోయాడు. డబ్బులను గమనించి భూపాలపల్లి డిపోలో సెక్యూరిటీ సిబ్బందిని కలిసి సమాచారం ఇచ్చారు. వారు మంథని డీఎంకు సమాచారం ఇవ్వడంతో బస్సును గుర్తించి కండక్టర్ ద్వారా సదురు నగదు ఉన్న కవర్‌ను గుర్తించి తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. ఈమేరకు సమాచారం ఇవ్వడతో రమేశ్ మంథనికి వచ్చి తన రూ. 2 లక్షల నగదు కవర్‌ను డీఎం శ్రావణ్‌కుమార్ నుంచి స్వాధీనం చేసుకున్నారు. మర్చిపోయిన తన రూ. 2 లక్షలను తిరిగి క్షేమంగా అప్పగించిన డీఎం శ్రావణ్‌కుమార్, కండక్టర్ తిరుపతమ్మ, డ్రైవర్ మొగిలికి రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆదమరిస్తే అంతే..

- వల్లంపహాడ్, ఇరుకుల్ల బ్రిడ్జిలపై ప్రమాదకరంగా గుంతలు
- రాకపోకలకు వాహనదారులు అవస్థలు



ఇరుకుల్ల వంతెనపై తేలిన ఇనుప చువ్వలు

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 22: కరీంనగర్ శివారులోని ప్రధాన రహదారిపై రోడ్లు అధ్వాన్నంగా మారాయి. కరీంనగర్ మండల శివారులోని ప్రధాన రాజీవ్ రహదారిపై, కరీంనగర్ నుంచి మంచి ర్యాల ప్రధాన రహదారి వల్లంపహాడ్ బ్రిడ్జిపై రహదారి ప్రమాదకరంగా మారింది. ఇరుకుల్ల వంతెనపై పలు చోట్ల గుంతలు ఏర్పడి తరచూ ప్రవ వాదాలు జరుగుతున్నాయి. కరీంనగర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్లే రహదా రిపై వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వల్లంపహాడ్ బ్రిడ్జి మూల వద్ద ఏర్పడిన భారీ గుంత ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు సేఫ్టీ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వల్లంపహాడ్ బ్రిడ్జి బ్రిడ్జిపై, ఇరుకుల్ల బ్రిడ్జి రహదారిపై మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత



వల్లపహాడ్ బ్రిడ్జిపై ప్రమాదకరంగా ఉన్న గుంత

స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

కోనరావుపేట, సెప్టెంబరు 22 : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించాలని వేములవాడ బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చలిమెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు కార్యకర్తలు కృషి అవసరమన్నారు. కార్యకర్తలే పార్టీకి పునాదులన్నారు. సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, ఫాక్స్ చైర్మన్లు రామ్మోహన్ రావు, బండ నర్సయ్య, మాజీ ఎంపీపీ చంద్ర గౌడ్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

- పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

వేములవాడ, సెప్టెంబరు 22: భారతీయ జనతా పార్టీతోనే దేశ అభివృద్ధి సాధ్యం అవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం వేములవాడలోని పలు వార్డుల్లో నిర్వహించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ దేశ అభివృద్ధి కేవలం భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమని, దేశ అంతర్గత భద్రత, విదేశాలతో సత్సంబంధాలు వంటి అంశాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా కొనసాగిస్తున్నదని అన్నారు. దేశ ప్రజల సంక్షేమం, పేదరిక నిర్మూలన, దేశంలో అవినీతి నిరోధం వంటి కార్యక్రమాలను మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2 లక్షల సభ్యత్వ నమోదు లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఆదివారం ఒక్కరోజే 6000 మంది బీజేపీ సభ్యత్వం పొందారని తెలిపారు. దేశ అభివృద్ధి కోసం బీజేపీకి మద్దతు ఇచ్చేందుకు పార్టీ సభ్యత్వం పొందాలని ఆయన కోరారు. బీజేపీ దళిత మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వేములవాడలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న ప్రతాప రామకృష్ణ

బీజేపీ సభ్యత్వ నమోదుకు స్పందన

● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



సభ్యత్వ నమోదు చేయిస్తున్న బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశ వ్యాప్తంగా బీజేపీ సభ్యత్వ నమోదుకు మంచి స్పందన లభిస్తున్నదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం కరీంనగర్‌లోని 57వ డివిజన్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెంబర్ షిప్ అభియాన్‌లో భాగంగా పది కోట్ల సభ్యత్వాలు నమోదు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. కరీంనగర్‌లో రెండు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్‌నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి బూత్‌లో 200 మందితో సభ్యత్వ నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో 2028లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కేరళ రాష్ట్రంలోనూ బీజేపీ సభ్యత్వ నమోదుకు మంచి స్పందన లభిస్తున్నదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, కటకం లోకేష్, కొలగాని శ్రీనివాస్, బండ రమణారెడ్డి పాల్గొన్నారు.

ఏఎంసీ నూతన పాలక వర్గం సభ్యులకు సన్మానం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 22: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ ఏఎంసీ నూతన పాలక వర్గం సభ్యులను స్థానిక కాంగ్రెస్ నాయకలు ఆదివారం ఘనంగా సన్మానించారు. చైర్‌పర్సన్ సబేరాబేగం, వైస్ చైర్మన్ రాంరెడ్డిలతో పాటు సభ్యులను శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, బాబు, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు

కోనరావుపేట, సెప్టెంబరు 22 : కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలో పోచమ్మ దేవాలయ పునర్నిర్మాణం కోసం పలువురు దాతలు విరాళాలను అందజేశారు. గ్రామానికి చెందిన వీరబోయిన తిరుపతి రూ. 21,116, తాళ్లపల్లి విజయ్ గౌడ్ రూ. 11,116, ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో జవ్వాజి శ్రీనివాస్ గౌడ్ వెయ్యి రూపాయలు, నాగరాజు వేయి రూపాయలు విరాళాలను అందజేశారు.

పారిశుధ్య కార్మికుడికి ఆర్థిక సహాయం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 22: మండల కేంద్రానికి చెందిన పారిశుధ్య కార్మికుడు కాసుపాక లక్ష్మణ్‌కు బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతిరెడ్డి ఆదివారం రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. వీధిదీపాలు అమరుస్తుండగా లక్ష్మణ్ గాయపడ్డాడు. బాధితుడిని పరామర్శించిన తిరుపతిరెడ్డి అండగా ఉంటానని భరోసా కల్పించాడు.

దక్షిణ భారత సైన్స్ డ్రామా ఫెస్టివల్

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 22: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి డ్రామా ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు డీఈవో జగన్మోహన్ రెడ్డి తెలిపారు. జాతీయ సైన్స్ డ్రామా ఫెస్టివల్‌కు సన్నాహకంగా విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలాజికల్ మ్యూజియం బెంగుళూరు వా రి ఆధ్వర్యంలో నవంబర్‌లో జరుగు దక్షిణభారత సైన్స్ డ్రామా ఫెస్టివల్ ఎం పికకు పలు అంశాలపై సైన్స్ డ్రామా జిల్లా కేంద్రంలోని టీచర్స్ భవన్‌లో ఈ నెల 28న జరుగుతాయన్నారు. విద్యాశాఖచే జారీ చేసిన గుగూల్ ఫారంను ఈ నెల 26 లోను తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయి డ్రామా ఫెస్టివల్‌లో ఉత్తమంగా ఎంపికైన మొదటి రెండు డ్రామాలు అక్టోబర్ 17,18 తేదీల్లో రాష్ట్రస్థాయిలో జరిగే సైన్స్ డ్రామా ఫెస్టివల్‌కు ఎంపికైతాయ న్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ ను 9440212333 లో సంప్రదించాలని సూచించారు.

మృత్యువులోనూ వీడని బంధం

గంటల వ్యవధిలో అన్నాదమ్ముల మృతి

ఎండపల్లి, సెప్టెంబర్ 22: మృత్యువులోనూ అన్నదమ్ముల బంధం వీడలేదు. తమ్ము డు మృతి చెందిన విషయాన్ని జీర్ణించుకోలేక అన్న కూడా తీవ్ర మనోవేదనకు గురై 24 గంటలు గడవక ముందే అన్న కూడా తుది శ్వాస విడిచిన ఘటన జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని పాతగూడూరులో విషాదం నింపింది. గ్రామస్థులు తెలిపిన కథనం మేరకు.. గ్రామానికి చెందిన రెడ్డిమల్ల నర్సయ్య(75), రెడ్డిమల్ల వెంకటయ్య(77) ఇద్దరూ అన్నదమ్ములు. కొన్ని రోజుల క్రితం తమ్ముడు నర్సయ్య గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ సర్జరీ చేయించుకున్నాడు. పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. నర్సయ్య దహన సంస్కారాల్లో పాల్గొన్న అన్న వెంకటయ్య తమ్ముడు తనను విడిచి పోయాడంటూ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. కుటుంబ సభ్యులతోనూ తమ్ముడి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ బాధపడ్డాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లోనూ ఒక్కసారిగా కుప్ప కూలి మృతి చెందాడు. 24 గంటలు గడవక ముందే అన్న దమ్ములు మరణించడంతో కుటుంబంలో విషాధ చాయలు అలుముకున్నాయి.

ఎమ్మెల్యేను పదవి నుంచి తొలగించాలి

ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకుల డిమాండ్

కోరుట్ల, సెప్టెంబరు 22 : అంబేద్కర్‌ను అవమాన పరిచిన ఎమ్మెల్యేను పదవి నుంచి తొలగించి కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నిరసన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవ ర్గ ఎమ్మెల్యే రామకృష్ణరాజ అంబేద్కర్‌ను అవమార పరిచే విధంగా ప్రవ ర్తించి అక్కడ ఏర్పాటు చేసిన ప్లెక్సీని తొలగించారని ఆరోపించారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పందించి అంబేద్కర్‌ను కించపరిచిన ఎ మ్మెల్యేతో పాటు అతని అనుచరులను కఠనంగా శిక్షించాలని డిమాండ్ చే శారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ నాయకులు ఉయ్యల శోభన్, ఉయ్యాల నర్సయ్య, బలిజ రాజారెడ్డి, కృష్ణప్రసాద్, వేణుగోపాల్, దేవయ్య, ఎడ్ల ప్రభాకర్, సంజీవ్, విజ్ఞాన్, మాదేశ్, దిగ్నేష్, నరేంధర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 22: ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన బీజేవైఎం కార్యకర్త న్యాలకొండ రాకేశ్ కుటుంబానికి ఆ పార్టీ నాయకులు ఆదివారం బియ్యం అందజేశారు. ఆ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్‌యాదవ్, సత్తయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అరవింద్, సాయిరాం, నరేశ్, ప్రశాంత్, సాయి, నితిన్, సాయిపవన్, రెడ్డి సంఘం సభ్యులు సత్యనారాయణరెడ్డి, దేవరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలపై పర్యవేక్షణ కరువు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 22: రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థలపై సర్కారు పర్యవేక్షణ కరవవడంతోనే పలు ఘటనలు చోటు చేసుకుంటున్నాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సత్యం అన్నారు. పాముకాటు గురవడంతోపాటు కేజీబీవీ భవనం పైనుంచి దూకి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇల్లంతకుంట మండలం గాలిపల్లి సంక్షేమ పాఠశాల విద్యార్థి రోహిత్, వీర్నపల్లి కేజీబీవీ విద్యార్థిని అశ్వితను స్థానిక నాయకులతో కలిసి ఆదివారం పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సత్యం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో నిరుపేద విద్యార్థులకు కనీసం సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. పరిసరాలు ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలతో నిండిపోయి విషపూరిత జీవులతో విద్యార్థులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. పూర్తి స్థాయిలో సిబ్బంది లేక పర్యవేక్షణ కొరవడిందని అన్నారు. విద్యాలయాల్లో సిబ్బందిని నియమించడంతోపాటు పరిసరాలను పరిశుభ్రం చేసి పర్యవేక్షించాలన్నారు. చికిత్స పొందుతున్న విద్యార్థులకు ప్రభుత్వమే పూర్తి ఖర్చులను భరించి ఆదుకోవాలని సత్యం డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు నారాయణగౌడ్, రవీందర్, నరేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, మనోహర్, మల్లేశం తదితరులు ఉన్నారు



రోహిత్‌ను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

నవంబరులో సీపీఎం జిల్లా మహా సభలు



సీపీఎం కార్యాలయంలో మాట్లాడుతున్న మూషం రమేష్

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 22: సీపీఎం జిల్లా మహాసభలు నవంబరులో జరగనున్నాయని, ఇందుకోసం వార్డుల వారీగా సమావేశాలను నిర్వహిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ అన్నారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృతలాల్ శుక్లా కార్మిక భవనంలో ఆదివారం సీపీఎం వెంకంపేట శాఖ మహాసభలు అల్లె రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మూషం రమేష్ మాట్లాడుతూ నవంబరులో జరగనున్న జిల్లా మహాసభల నేపథ్యంలో వార్డుల శాఖల ఆధ్వర్యంలో సమావేశాలను నిర్వహించి మహాసభను విజయవంతం చేసేలా ప్రోత్సహించనున్నట్లు చెప్పారు. సిరిసిల్ల పట్టణంలో మరమగ్గాల కార్మికులకు ఉపాధి లేక గత తొమ్మిది నెలలుగా కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి కార్మికుల ఇబ్బందులను గుర్తించి ఉపాధి కల్పించాలని కోరారు. వెంకంపేట ఏరియాలో కుక్కల బెడద అధికంగా ఉందని, వాటిని మున్సిపల్ అధికారులు తరలించాలన్నారు. సంజీవయ్యనగర్ రోడ్డులోని గాంధీ ఆసుపత్రి వద్ద ప్రతీ రోజు మురికి నీరు నిలుస్తుండడంతో అక్కడ నివసిస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,, దీనిపై మున్సిపల్ అధికారులు స్పందించి నీరు నిలవకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలని కోరారు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమై ఇళ్లలోకి నీళ్లు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని ప్రస్తుత వర్షాకాలంలో నీరు రాకుండా అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేదని అన్నారు. వెంకంపేట ప్రాంతంలో ఇళ్లు లేని వారు ఉన్నారని, వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించి అనర్హులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వెంకంపేట శాఖ నూతన కార్యదర్శిగా అన్నల్‌దాస్ గణేష్‌ను ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సభ్యులు కుమ్మరి కుంట కిషన్, ఎక్కల్‌దేవి జగదీష్, అడెపు సంపత్, కోడం సుధాకర్, బొమ్మెన బాలరాజు, పిస్క లక్ష్మణ్, రాము, కొండ రమేష్, భీమనాధిని రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 22: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ పాఠశాలల పారిశుధ్య కార్మికుల సంఘం జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం ఏఐటీయూసీ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల పారిశుధ్య కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల జీతభత్యాలు పెంచాలని డిమాండ్ చేశారు. అమ్మఆదర్శ కమిటీలు కాకుండా నేరుగా కార్మికుల ఖాతాలో జీతాలను జమ చేయాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రతను కల్పిస్తూ వారికి పేనాయిల్, బ్లీచింగ్ పౌడర్, మాస్కులు, సేఫ్టీ బ్లౌజులు ప్రభుత్వమే సమకూర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పారిశుధ్య కార్మికులను గుర్తించి బీమా సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులు డ్రెస్ కోడ్ అమలు చేయాలని, పనికి సమానంగా వేతనాలు ఇవ్వాలని న్యాయస్థానం చెప్పినట్లు గుర్తు చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామన్నారు. ఈ సమావేశంలో కార్మికులు లత, లక్ష్మి, నరసవ్వ, రాజవ్వ, లక్ష్మి, అంజయ్య, సంధ్యారాణి, నరసయ్య, శంకర్, రాజేశ్వరి, శ్యామల, జైతు, రాజేశ్వరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

చరిత్రను వక్రీకరించేందుకు బీజేపీ కుట్ర

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 22: దొరలకు, భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన పోరాటానికి బీజేపీ మతం రంగు పులిమి, చరిత్రను వక్రీకరించే కుట్రలు చేస్తోందని సీపీఎం రాష్ట్ర నాయకులు పుప్పాల శ్రీకాంత్ అన్నారు. జిల్లా కేంద్రం లోని సీపీఎం కార్యాలయంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పక్షో త్సవాల సభ సీపీఎం జిల్లా కన్వీనర్ తిరుపతినాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాంత్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తికోసం, వెట్టిచాకిరీ నుంచి విముక్తికోసం సాగిన వీర తెలంగాణ రైతాం గ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమంలో పాల్గొని అమరులైన వారికి ప్రతీకగా అమరుల స్థూపాలు ఏర్పాటు చేయాలని అన్నారు. తెలంగాణలో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాగిన ఈ మహోన్నత పోరాటంలో ఎందరో వీరులు అమరులయ్యా రని, వీళ్లంతా కుల, మతాలు పక్కనబెట్టి దోపిడీ, వెట్టిచాకిరి విముక్తికి పోరాడా రన్నారు. బీజేపీ స్వార్ధరాజకీయ ప్రయోజనాల కోసం రైతాంగ పోరాటానికి మతం రంగు పులిమితే ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. దున్నేవాడికే భూమి కావాలని పోరు చేసిన అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలిసే విధంగా జగిత్యాల పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వారి కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఇందూరి సులోచన, కోమటి చంద్రశేఖర్, వెంకటాచారి, రమేష్, సిరికొండ చంద్రయ్య, శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం



హాస్టల్‌లో సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 22: విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పర్లపల్లి రవీందర్, రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి దామెర సత్యం అన్నారు. గాలిపెల్లి గ్రామంలోని బీసీ హాస్టల్‌లో చదువుతున్న రమావత్ రోహిత్ రెండు రోజుల క్రితం పాముకాటుతో చికిత్స పొందుతుండగా ఆదివారం హాస్టల్‌లో విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించడం, స్టాఫ్‌ను నియమించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రోహిత్ వైద్యఖర్చులు భరించాలని, ఇలాంటి ఘటనలు జరుగకుండా చూడాలని అన్నారు. లేనట్లయితే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు అన్నాడి నరేందర్‌రెడ్డి, మోతె రాజిరెడ్డి, మనోహర్‌పటేల్, దొమ్మాటి లక్ష్మన్, ఆరె మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలి

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 22: స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పార్టీ శ్రేణులకు ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. శనివారం సాయంత్రం గాంధీభవన్‌లో పార్టీ జిల్లాల అధ్యక్షులు, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న వారంతా తమ తమ గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ, సమస్యలు తెలుసుకుంటూ వారితో మమేకం కావాలని కోరారు. ఆరు గ్యారంటీ పథకాల హామీలో భాగంగా ప్రస్తుతం అమలులో ఉన్న పథకాల ద్వారా ప్రజలు లబ్ధి పొందేలా పార్టీ కార్యకర్తలు, నాయకులు చూడాలన్నారు. గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును పొందలేని కుటుంబాలను గుర్తించి వారితో సంబంధిత అధికారులకు దరఖాస్తులు చేయించాలని ఆయన సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను త్వరలో చేపట్టబోతున్నారని, ఇక నుంచి గ్రామస్థాయిలో ఏర్పాటు చేయనున్న ఇందిరమ్మ కమిటీల ద్వారానే లబ్ధిదారులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఆ కమిటీల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు చోటు దక్కించుకునేందుకు కృషి చేయాలన్నారు. ఇందిరమ్మ కమిటీల్లో స్థానం పొందడం వల్ల గ్రామంలో అర్హులైన వారిని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా ఎంపిక చేసే అవకాశం లభిస్తుందని, తద్వారా అర్హులైన ప్రజలకు మేలు జరుగుతుందని ఆయన తెలిపారు.

ముగ్గురి అరెస్టు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 22: అడవి జంతువుల వేటకు నాటు బాంబులను ఉపయోగిస్తున్న సిరిసిల్ల పట్టణం సర్దాపూర్‌కు చెందిన మొగిలి అంజయ్య, కామారెడ్డికి చెందిన మానేపల్లి చంద్రకళ, కోనరావుపేట మండలంలోని ధర్మారానికి చెందిన పిట్టల రాజలింగంను ఆదివారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ ఆదివారం తెలిపారు. వారి వద్ద 25నాటు బాంబులు, 5 నైలాన్ వలలు, 5 ఇనుప వలలు, 3 జేవైర్ బెండల్స్, ఒక ఇనుప కత్తి, 7 దారపు కండెలు, ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

ఘాట్ రోడ్డుపై మొరాయించిన ఆర్టీసీ బస్సు

బీర్‌పూర్, సెప్టెంబరు 22: బీర్‌పూర్ ఘాటు రోడ్డు ఎక్కే క్రమంలో ఆర్టీసీ బస్సు ఆదివారం మొరాయించింది. దీంతో అర గంగటపాటు ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని గడిపారు. జగిత్యాల నుంచి కమ్మునూర్ కలమడుగు మీదుగా జన్నారం, కడెం మండలాలకు మూడు బస్సులు నడుస్తుంటాయి. ఒక్కో బస్సు మూడు ట్రిప్పులుగా నడుస్తుంది. ఈ క్రమంలో ఆదివారం మధ్యహ్నం కడెం నుంచి జగిత్యాలకు వస్తున్న బస్సులో కెపాసిటీకి మించిన ప్రయాణికులు ఎక్కడంతో బీర్‌పూర్ ఘాటు(చిన్నమేరు) ఎక్కే క్రమంలో బస్సులో కెపాసిటీ 56 మంది ఉండాలి. కానీ 100 ఎక్కారు. దీంతో బస్సు ఫెయిల్ అయి గుట్టపైనే నిలిచి పోయింది. బస్సులో ఉన్న ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కిందకు దిగి బస్సును వెనుక నుంచి ఘాటు ఎక్కే వరకు నెట్టారు. కాసేపటికి ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

అవినీతికి బ్రాండ్ అంబాసిడర్లు బీఆర్‌ఎస్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 22: అవినీతికి బ్రాండ్ అంబాసిడర్లు బీఆర్‌ఎస్ నాయకులని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ విమర్శించారు. ఆదివారం తంగళ్లపల్లి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేషన్ డీలర్ల ఫలితాలు వెలువడక ముందే అనవసర ఆరోపణలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులపై మండిపడ్డారు. సొంత పార్టీ కార్యకర్తల దగ్గరే డబ్బులు దండుకొని పథకాలు అప్పజెప్పిన బీఆర్‌ఎస్ చరిత్ర మర్చిపోలేదన్నారు. ఓడినా ప్రజల్లో ఉండి ప్రజల పక్షాన నిలిచిన నేత కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన నేతల చిట్టా ప్రజా కోర్టులో ఉంచి నిలదిస్తామని హెచ్చరించారు. ఉద్యమ నాయకుడు కేకే మహేందర్ రెడ్డిపై అనవసర ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. కేకే మహేందర్‌రెడ్డి రాజకీయ భవిష్యత్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాపాలనలో ప్రజలు మంచి జరుగుతుంటే బీఆర్‌ఎస్ నాయకులు జీర్ణించుకోవడం లేదన్నారు. రేషన్ షాపుల మంజూరులో డబ్బులు తీసుకుంటున్నారని బీఆర్‌ఎస్ నాయకుల చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. రేషన్ డీలర్ల నియామక ఫలితాలు రాకముందే అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ బతుకమ్మ చీరల పేరిట దోచుకుందని, కాంగ్రెస్ ప్రభుత్వం బకాయిలు చెల్లించిందని అన్నారు. పద్మశాలీల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తూ పద్మశాలీల పక్షాన నిలుస్తుంది కేకే మహేందర్‌రెడ్డి అనే విషయం మరవద్దన్నారు. గత ప్రభుత్వ హయాంలో దోచుకున్నది చాలాక దొంగే దొంగ అన్న చందగా బీఆర్‌ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సొంత పార్టీ కార్యకర్తల దగ్గర పైసలు తీసుకొని సబ్సిడీ ట్రాక్టర్లు ఇచ్చిన విషయం మరిచారా? అని ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు, రైతు బంధు, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుల నుంచి చేతివాటం ప్రదర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అనుకూలమైన అధికారులతో దొంగ పట్టాలు చేసుకొని వందల ఎకరాలను మింగారని, ఇప్పుడు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. గత ప్రభుత్వంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇతర నేతలు అధికారిక కార్యక్రమాల్లో ప్రోటోకాల్ మార్చి పాల్గొన్న విషయాన్ని మర్చిపోయారా? అన్నారు. మరోసారి కేకే మహేందర్ రెడ్డిపై అవాకులు చెవాకులు పేలితే సహించేది లేదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సర్పంచులు, నాయకులు చేసిన అవినీతి చిట్టాను ప్రజా కోర్టులో ఉంచి నిలదీస్తామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు భైరినేని రాము, నెరెళ్ల నర్సింగం గౌడ్, పొన్నాల పరశురాములు, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరసయ్య రాజు, బాలు, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మణ్ గౌడ్, రవి, శేఖర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: అవినీతి బ్రాండ్ అంబాసిడర్లు కూడా అవినీతి జరిగిందని పేర్కొనడం సిగ్గుచేటని ముస్తాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గజ్జెల రాజు అన్నారు. ముస్తాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లలో ప్రజలకు ఏమీ చేయని బీఆర్‌ఎస్ ప్రజలకు మంచి చేస్తుంటే కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే యత్నం చేస్తోందన్నారు. రేషన్ డీలర్ల ఫలితాలు వెలువడక ముందే బీఆర్‌ఎస్ నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సొంతపార్టీ కార్యకర్తల దగ్గరే డబ్బులు దండకొని పథకాలు అప్పజెప్పినా ఘనత బీఆర్‌ఎస్‌దే అన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినా ప్రజల మధ్యలో నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి అండగా కేకే మహేందర్‌రెడ్డి నిలస్తున్నారన్నారు. కేటీఆర్ విదేశీ పర్యటనలకు తిరుగుతూ ప్రజా సమస్యలను గాలికివదిలేశారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, ఎస్ఆర్ఐ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్, అరుట్ల మహేశ్‌రెడ్డి, ఉచ్చిడి బాల్‌రెడ్డి, రంజాని నరేశ్, తాళ్ల విజయ్‌రెడ్డి, మిరుదొడ్డి దేవేందర్, కేసుగాని చంద్రమౌళి, హరిబాబు, బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గజ్జెల రాజు